క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత హర్షకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన వెలగపూడి నాగేంద్ర సాయి హర్ష ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మదనగోపాల స్వామి గ్రామోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య హోమం, బలిహరణ ప్రసాద వినియోగం నిర్వహించి సాయంత్రం నుంచి విశేష పూజలు, అర్చనాది కార్యక్రమాలు జరిపారు. మహిళలు దేవతాపారాయణలు చేశారు. శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వాహన తనిఖీలు



పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్సై రంగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరోసారి హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు చెప్పారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించినట్లు తెలిపారు.


దేవతామూర్తులకు క్షీరాధివాసం



రెడ్డిగణపవరంలో విశేష పూజలు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కనక దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని గురువారం నిత్యపూజ, గోపూజ, గవ్యాంత పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రతిష్ఠా మూర్తుల యంత్రాలకు క్షీరాధివాసం చేశారు. జపతీర్థ వినియోగం, సామూహిక లలిత శాస్త్ర పారాయణం, విశేష దుర్గా శూలిని యంత్ర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రత్నాజీరావు, గద్దే రామచంద్రరావు, అల్లూరి సోమేశ్వరరావు, భౌమరాజు సత్యనారాయణరాజు, భౌమరాజు ధనుంజయ రాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పరివర్తనకు కవితలు దోహదం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.విజయబాబు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ జయబాబు మాట్లాడుతూ మనిషిని, మనసును కదిలింపజేసే శక్తి అక్షరాలకు ఉంది అని, సామాజిక పరివర్తనకు కవితలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మనిషిలో సృజనాత్మకతను, నైతిక విలువలను పెంపొందించడానికి కవితల అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కవితలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా



నాలుగో విడత ఆసరా చెక్కును అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్‌కుమార్ (ఫైల్)



పోలవరంలో ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

కామవరపుకోట, పోలవరం రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే వారి కుటుంబాలు సంతోషంగా ఉంటాయని విశ్వసించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకం లబ్ధి మహిళల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. దీంతో అక్కచెల్లెమ్మల ఆర్థిక స్థోమత మరింత బలపడి ఆనందంగా జీవిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జగనన్న ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మాయమాటలు చెప్పింది తప్ప ఆచరణ చూపలేదు. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే నాలుగు దఫాలుగా చెల్లించింది. దీంతో వారు స్వయం ఉపాధి పొందేలా అండగా నిలిచింది. ఆ సొమ్ముతో కొంతమంది మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాలలో యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. కిరాణా కొట్లు, పాడి గేదెల పెంపకం, రాడ్ వెల్డింగ్ మిషన్, ఫ్యాన్సీ, గొర్రెల పెంపకం వంటి ఇంకా అనేక రంగాలలో యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వారు ఆయా రంగాల్లో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కామవరపుకోట మండలంలో 1290 డ్వాక్రా మహిళా మండలి పొదుపు సంఘాలకుగాను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా ప్రభుత్వం అందించిన మొత్తం లబ్ధి రూ.62.13 కోట్లు మహిళల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయటం ద్వారా వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడింది. పోలవరం మండలంలో 850 డ్వాక్రా గ్రూపులకు రూ. 28.71 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలకు సంబంధించి వడ్డీని కూడా జగనన్నే చెల్లించారు. వడ్డీ చెల్లింపులో భాగంగా రూ.12.56 కోట్లు నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

కిరాణా కొట్టుతో ఉపాధి



నేను సరోజినీ డ్వాక్రా మహిళా మండలి గ్రూపులో సభ్యురాలుగా ఉన్నాను. నాకు వితంతు పింఛన్‌తోపాటు డ్వాక్రా మహిళా మండలి సంఘాలకు ప్రభుత్వం అందించే సున్న వడ్డీ రూ.8 వేలు, చేయూత పథకం ద్వారా రూ.75 వేలు, ఆసరా పథకం ద్వారా రూ.70 వేలు జగనన్న ప్రభుత్వంలో వచ్చాయి. ఈ సొమ్ములతో మా గ్రామంలో కిరాణా కొట్టు పెట్టుకుని ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. జగనన్నకు మేమంతా రుణపడి ఉంటాం.

– మాండ్రు జ్యోతి,
తాడిచర్ల గ్రామం, సరోజినీ డ్వాక్రా మహిళా మండలి గ్రూపు

పాడి గేదెలతో ఉపాధి



నేను మా గ్రామంలోని వినాయక డ్వాక్రా మహిళా మండలి గ్రూపులో సభ్యురాలుగా ఉన్నాను. గత టీడీపీ పాలనలో నాకు ఏ విధమైన సహాయం అందలేదు. కానీ జగనన్న ప్రభుత్వం డ్వాక్రా మహిళా మండలి సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీతో పాటు, ఆసరా పథకం ద్వారా ఏడాదికి రూ.18 వేలు చొప్పున ఇప్పటివరకు రూ.72 వేలు జగనన్న ప్రభుత్వం నుంచి వచ్చింది. ఈ సొమ్ములతో పాడి గేదెలను కొనుక్కుని వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– మోటమర్రి నాగలక్ష్మి,
వినాయక డ్వాక్రా మహిళా మండలి గ్రూప్, ఈస్ట్ యడవల్లి

జగనన్నకు రుణపడి ఉంటాం



డ్వాక్రా మహిళా మండలంలోని సభ్యులకు జగనన్న ప్రభుత్వం అందించిన సున్న వడ్డీ, చేయూత పథకంతో పాటు ఇప్పటివరకు డ్వాక్రా రుణమాఫీ ఆసరా పథకం ద్వారా నేను రూ.72 వేలు అందుకున్నాను. ఈ డబ్బులతో గ్రామంలో కిరాణా కొట్టు పెట్టుకున్నాను. షాపు ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. మా కుటుంబాన్ని ఆదుకుని అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– వేముల అన్నపూర్ణ,
డ్వాక్రా మహిళా మండలి సభ్యురాలు, వెంకటాపురం

కన్న కొడుకులా జగన్ ఆదరించారు



కన్న కొడుకులు కూడా ఆదరించని ఈ రోజుల్లో మాలాంటి వాళ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకుగా ఆదుకుంటున్నారు. నేను చేయూత పథకం ద్వారా రూ.18,750 చొప్పున ఇప్పటికి మూడుసార్లు సాయం అందుకున్నాను. డ్వాక్రా రుణమాఫీ (ఆసరా) ఏడాది రూ.11వేలు చొప్పున నాలుగు సార్లు నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. అంతేగాక ప్రతి నెలా ఒకటవ తేదీన వితంతు పింఛన్ రూ.3 వేలు వస్తోంది. ఈ డబ్బులతో చిల్లర కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. మమ్మల్ని ఆదరించి బతుకుతెరువు చూపించిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– బాన వరలక్ష్మి,
కొత్తపేట, పోలవరం పంచాయతీ

ఆలయ అభివృద్ధికి విరాళం



దాత దత్తాత్రేయ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసి ఉన్న పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీ చక్ర సమన్విత శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధి నిమిత్తం దాత అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి దంపతులు రూ.50 వేల నగదును విరాళంగా గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు దాత దత్తాత్రేయ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందించి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కనుమరుగవ్వడం ఖాయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎం సూర్యనారాయణ



ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి స్వగృహంలో పార్టీ నేతలతో సూర్యనారాయణ

చింతలపూడి: భవిష్యత్తులో రాష్ట్రంలో టీడీపీ కనుమరుగు అవ్వడం ఖాయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో గురువారం ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లతో సమావేశమయ్యారు. సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకుతిరిగే టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీకి చెందిన 40 మంది నాయకులను నిర్దాక్షిణ్యంగా మోసం చేసి ఆ సీట్లు బీజేపీ, జనసేనలకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. ఇతర పార్టీల నుంచి కొత్తగా వచ్చే వారిని చేర్చుకుని వారికి ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. 2019లో బీజేపీని తిట్టి ఎన్‌డీఏ నుంచి బయటికి వచ్చి కాంగ్రెస్‌తో జతకట్టి మళ్లీ ఏ ముఖం పెట్టుకుని బీజేపీతో పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే మాత్రమే ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఈ నెల 27 నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మేము సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగరవేయడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బాలరాజు దంపతుల పర్యటన

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. అచ్యుతాపురం, బోడిగూడెం పంచాయతీల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ నేతలు తెలిపారు.

నేడు మూడు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరం 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో కరెంటు లైన్లకు అడ్డొస్తున్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించనున్నట్టు ఆశాఖ ఏఈఈ నరసింహస్వామి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామసింగవరం, కొత్తగూడెం, జి.కొత్తపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ఆయన పేర్కొన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



దేవులపల్లిలో మాట్లాడుతున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్ అన్నారు. మండలంలోని దేవులపల్లిలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేష్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. లక్కవరం ఎస్సై సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



సీఎస్‌టీఎస్ కళాశాలలో అంతర్జాతీయ అంతర్జాల సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ విభాగ ఆధ్వర్యంలో ఆంగ్ల సాహిత్యం, ఆంగ్ల భాషలో తాజా పోకడలు అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎస్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని అన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డా.జి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ రావు మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌కి గాను 67 పరిశోధన పత్రాలను సమర్పించడం జరిగిందన్నారు. వీటిని ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమిషన్ రేట్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ డా. కె.విజయ బాబు చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం పరిశోధనా పత్రాలను నాలుగు విభాగాలుగా విభజించి చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.పంకజ్ కుమార్, డా.ఎం.కార్మెల్ సోఫియా, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.మధు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీధర్‌ను విమర్శించే అర్హత టీడీపీ నేతలకు లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌బాబు, మోహన్ తదితరులు

లింగపాలెం : ఎటువంటి అవినీతి మరక లేని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను విమర్శించే అర్హత టీడీపీ నేత ఘంటా మురళీకి లేదని రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ అన్నారు. గురువారం లింగపాలెంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భోగోలు గ్రామంలోని రిజర్వుఫారెస్ట్ భూమిలకు టీడీపీ ప్రభుత్వం వస్తే చెట్టు పట్టాలు ఇప్పిస్తామని మురళీ చెప్పడం పేదలను మరోసారి మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వంలో అసలు ఆ జీఓనే లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఏలూరు ఎంపీగా బీసీ యువకుడు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు సీఎం జగన్‌మోహనరెడ్డి ద్వారా ఎంపీ శ్రీధర్ టిక్కెట్ ఇప్పించి అతని గెలుపుకోసం కృషిచేస్తున్నారని తెలిపారు. అయితే ఎంపీ శ్రీధర్ ఎన్నికలు అవ్వగానే అమెరికా వెళతారంటూ టీడీపీ నేతలు హేళన చేయడం హాస్యాస్పదమన్నారు. శ్రీధర్‌కు అమెరికాలో వ్యాపారాలు ఉన్నాయని, ఆయన అమెరికా వెళడం కొత్తేమి కాదని అన్నారు. ఎంపీ అయ్యాక ఇప్పటివరకు 10 సార్లు వెళ్లి వచ్చారన్నారు. ఎన్నికలు అయ్యాక మీ పరిస్థితి, మీ పార్టీ పరిస్థితి ఏమిటో చూడుకోండని ఎద్దేశా చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్, సొంగా సందీప్, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డిన శ్రీను, ఇనుగంటి సతీష్, కోటగిరి ధీరాజ్ కృష్ణ, కోటగిరి హరిష్ తదితరులు పాల్గొన్నారు.

బోయగూడెంలో ఇంటింటి ప్రచారం



బోయగూడెంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని బోయగూడెంలో గురువారం బూత్ కన్వీనర్ కొత్తపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో మేము సిద్ధం .. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి తీసుకురావలసిన ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ బూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, మండల విద్యార్థి విభాగం కన్వీనర్ ఎం.దిలీప్, రామరాజునాయక్, గోపి, వెంపా వెంకటేశ్వర్రావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న దృశ్యం

చింతలపూడి: అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని గురువారం రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యవసాయ శాఖ, పాట్నర్స్ అండ్ ప్రాస్పరిటీ(పీఎన్‌పీ) సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అధికారులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పీఎన్‌పీ సూచించిన తడిపొడి విధానంలో మెలకువలను మెట్ట రైతులు పాటించాలని విజ్ఞప్తి చేశారు. చెట్ల పెంపకంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మీనా కుమారి, కౌసిక్, పీఎన్‌పీ సీఈఓ నరేష్ చౌదరి, ఏలూరు అగ్రికల్చరల్ ఏడీ సుబ్బారావు, కోఆర్డినేటర్ పులి కీర్తి, ఏఈఓ శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం



తెల్లం బాలరాజుని కలిసిన మండల నాయకులు

కుక్కునూరు: రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం కుక్కునూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ను మండల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో బాలరాజు మాట్లాడారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆ దిశగా కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి పోలవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

భీమిరెడ్డి సత్యమారెడ్డికి నివాళి



సత్యమారెడ్డికి నివాళి అర్పించిన విజయరాజు, పార్టీ నేతలు

లింగపాలెం: లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి సత్యమారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈమేరకు గురువారం సత్యమారెడ్డి కుమారులు బి.ప్రభాకరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డిలను వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, ఆ పార్టీ నేతలు పరామర్శించారు. సత్యమారెడ్డి మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు మేడవరపు అశోక్, మందలపు సాయిబాబు, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నూతలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబుపత్రాల మూల్యాంకన త్వరలో చేపట్టనున్న నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులకు ఆ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు గురువారం డీఈవో ఎస్.అబ్రహంకు వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, 60 ఏళ్లు పైబడిన వారికి, రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని, అలాగే మినహాయింపు కోరుకునే వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని కోరారు. అలాగే దివ్యాంగులు, బాలింతలు, గర్భిణిలకు సైతం మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 8 కిలోమీటర్ల లోపు పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

పోలవరంలో వర్షం

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో పోలవరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పొలాల్లో అక్కడక్కడా ఆరబెట్టిన మొక్కజొన్న కండెలను రైతులు హడావుడిగా పోగు చేసుకుని బరకాలు కప్పుకున్నారు. పల్లపు ప్రాంతాల్లో పలుచోట్ల వర్షం నీరు నిలిచిపోయింది.